
# నిజాయితీ

-టి.రామాంజనేయులు

"మీకు తెలియందేముంది బాబయ్యా. వానలు రాక రెండేళ్ళుగా పంటలేదాయె. ఇప్పటికి వడ్డీతో సరిపుచ్చుకోండి. వచ్చేయేడు మీ బాకీ మొత్తం తీర్చేస్తా. నన్ను నమ్మండి బాబూ" వేడుకుంటున్నాడు వెంకటయ్య.

"సరేలేవయ్యా. ఎంతో కొంత జమచేసి వెళ్ళు. కానీ ఇక ముందు ఇలాంటి మాటలు నేను ససేమిరా వినను జాగ్రత్త సుమా!" కఠినంగానే హెచ్చరించారు పరంధామయ్య.

"మీరిలాగే అంటూ ఉండండి డాడీ. ఈ ఊరి మనుషులే మీ నెత్తిన టోపీ తగిలిస్తారు. ఈ పల్లెటూరి



జనాన్ని నమ్మితే మనకూ అధోగతే" అసహనంగా తండ్రిమీద కోప్పడ్డాడు సుధీర్.

"అలా అనకు బాబూ. పల్లె ప్రజల మనసులు స్వచ్ఛమైనవి. వీళ్ళలో ఉన్న నిజాయితీ, భక్తి గౌరవాలు, ప్రేమానురాగాలు పట్నం మనుషుల్లో మచ్చుకైనా కనిపిస్తాయా?" కొడుకు మాటలకు అడ్డుచెప్పాడు పరంధామయ్య.

పరంధామయ్య మోతుబరి రైతు. అవసరాలకు అప్పురూపంలో అందరికీ సాయం చేసేవాడు. ఉదారంగా సాయం చేస్తే విలువ ఉండదని ఎంతో కొంత వడ్డీరూపంలో తీసుకునేవాడు. పరంధామయ్య ఒక్కగానొక్క కొడుకు సుధీర్. చిన్ననాటినుంచి పట్నంలో పెరిగి, అక్కడే చదివి ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

★ ★ ★

"దండాలండి పరంధామయ్యగారు. బాగున్నారా?" అంటూ వచ్చారు పక్క ఊరి రైతులు.

"రండిసోమయ్యా! ఇద్దరూ కలిసి వచ్చారు. ఏమైనా విశేషమా?" నవ్వుతూ అడిగారు పరంధామయ్య.

"రెండ్రోజుల కిందట నా ఎనుమును ఈ రంగయ్యకు అమ్మి డబ్బు తీసుకున్నాను. అంతవరకూ బాగానే ఉంది. నిన్న మధ్యాహ్నం దొమ్మరోగంతో ఆ ఎనుము చనిపోయింది. నాకీ సంగతి తెలిసి పొద్దున్నే రంగయ్య దగ్గరికెళ్ళా.." విషయం చెప్పసాగాడు సోమయ్య.

"అయ్యో పాపం! ఒక్కరోజులోనే రంగయ్యకింత నష్టమా? పైగా కరువు కాలం" సానుభూతి చూపించాడు పరంధామయ్య.

"అదేనండి. ఆ ఎనుము నా దగ్గరున్నా చనిపోయేది కదా. అలాంటప్పుడు ఒక్కరోజు తేడాతో రంగయ్య నష్టపోవడం ఏం ధర్మం. అందుకే నీ డబ్బు నీవు తీసుకో. అన్యాయంగా నీవెందుకు నష్టపోవాలి. దానికి మనకు రుణం తీరిపోయింది అని డబ్బు తిరిగి ఇవ్వబోయాను. కానీ ససేమిరా వద్దంటున్నాడు రంగయ్య. మీరైనా నచ్చచెబుతారేమోనని రంగయ్యను వెంటబెట్టుకుని మీ దగ్గరికి వచ్చాను" అన్నాడు సోమయ్య.

"అదెలా కుదురుతుంది సోమయ్యన్నా. నీ ఇంట్లో ఉండగా అది పోయి ఉంటే నాకు సంబంధం లేదు. డబ్బిచ్చి ఇంటికి తెచ్చుకున్నాను. అప్పుడది నాదే కదా. నా ఎనుము చనిపోతే నీతో డబ్బు తీసుకోవడమా. ఎలా కన్పిస్తున్నాను నీకు" బాధపడుతూ అన్నాడు రంగయ్య.

'ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారా?' ఆశ్చర్యపోయాడు సుధీర్.

సాభిప్రాయంగా కొడుకు వైపు చూశాడు పరంధామయ్య.

"నామాట వింటానంటే ఇద్దరికీ న్యాయం జరిగేల చెప్తానయ్యా. డబ్బు పూర్తిగా ఇచ్చి ఇంటికి తెచ్చుకున్నాడు కాబట్టి ఎనుము రంగయ్యదే. అందువల్ల సోవయ్యతో డబ్బు తీసుకోవడం అన్యాయమే. ఇంటికి తెచ్చుకున్న మరునాడే చనిపోయింది ఒక్కరోజు పుణ్యానికే రంగయ్య నష్టపోవడం కూడా మానవతా దృష్టితో చూస్తే అన్యాయమే. కాబట్టి ఇద్దరి న్యాయం చేయాలంటే మొత్తం సొమ్ముకాకుండా సగం డబ్బు రంగయ్యకి ఇస్తే సాయం చేశానన్న తృప్తి సోమయ్యకి ఉంటుంది. రంగయ్యకి కూడా న్యాయం జరిగినట్లు అవుతుంది. దీనికి మీరు ఏమంటారు?" అన్నాడు పరంధామయ్య. గుడ్డిలో మెల్లగా అనుకుంటూ ఇద్దరూ అయిష్టంగా వెళ్ళిపోయారు. ఇదంతా చూశాక ఉదయం బస్టాండ్‌లో జరిగిన సంఘటన గుర్తుచేసుకున్నాడు సుధీర్. తన ఊరి బస్సు కోసం ఎదురుచూస్తూ న్యూస్‌పేపర్ చదువుతూ కూర్చున్నాడు సుధీర్. టిప్‌టాప్‌గా దొరబాబులా ఉన్న వ్యక్తి సుధీర్ పక్కనే కూర్చున్నాడు.

"నా పేరు రవి. ఇక్కడే మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. అమ్మానాన్నల్ని చూడాలని ఊరెళుతున్నాను" అంటూ తానేం మాట్లాడకపోయినా ఏవేవో ధర్మసూత్రాలు వల్లిస్తూ సుధీర్ చేతిలోని పేపర్ స్వంతం చేసుకున్నాడు రవి.

ఆటో దిగి పరుగున వచ్చి అప్పుడే బయలుదేరబోతున్న బస్సుని ఎక్కాడు ఓ యువకుడు. ఆ తొందరలో అతని జేబునండి పర్సు కిందపడింది. ఆ యువకుడు గమనించకుండానే బస్సెక్కాడు. బస్సును ఆపాలని పైకి లేవబోయాడు సుధీర్. చటుక్కున ముందుకు ఉరికాడు రవి. కిందపడిన పర్సును తీసుకుని నెమ్మదిగా వెనుదిరిగాడు.

"అయ్యో! ఈయన బస్సును ఆపుతాడనుకున్నానే. పర్సును తన జేబులో వేసుకున్నాడేమిటి?" అనుకుంటూ ఉండగానే బస్సు వెళ్ళిపోయింది.

ఇంతలో "ఏమోయ్ ఆగవయ్యా. ఆ పర్సు నాది" అంటూ ముందుకొచ్చాడు ఓ భారీ పర్సనాలిటీ. మొదట్లో మొండికేశాడు రవి. కొద్దిసేపటికి ఏం ఒప్పందం కుదిరిందో కానీ ఇద్దరూ బయటకు వెళ్లిపోయారు. ఇదంతా చూస్తూ 'నాకెందుకులే' అని ఉండిపోయాడే కానీ వారి అన్యాయాన్ని ఎదిరించలేదు సుధీర్. ఇప్పుడు జరిగింది చూశాక పల్లెటూరి వాళ్లని చులకనగా చూసిన తన సంకుచిత మనస్తత్వానికి సిగ్గుపడ్డాడు సుధీర్.

"నన్ను మన్నించండి నాన్నగారూ! మీమాటలు తేలికగా కొట్టిపారేశాను. పల్లెటూరి ప్రజల్లోని నిజాయితీ, వారి మంచి మనసు ఎలాంటిదో గ్రహించాను. నా కళ్ళు తెరిపించారు" అంటూ తండ్రికి క్షమాపణ చెప్పాడు సుధీర్. నీతి, నిజాయితీలకు చిహ్నాలన్నట్లుగా ఠీవిగా రెండు మీసాలు దువ్వాడు పరంధామయ్య.

★